ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :135 బుధవారం మార్చి 11 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత కలకలం

**-ముంబైలో 20 శాతం హోటళ్లు మూత**
**-పలు నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత**
**-బ్లాక్ విక్రయాలపై కేంద్రం కట్టడి చర్యలు**





10మార్చి (మనప్రజాప్రతినిధి): దేశంలో చమురు, వంటగ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పలు ప్రాంతాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ముంబై నగరంలో వంటగ్యాస్ అందుబాటులో లేకపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు కార్యకలాపాలు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముంబై హోటల్ అండ్ రెస్టారెంట్ సంఘం తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని సుమారు 20 శాతం హోటళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడే ప్రమాదం ఉందని సంఘం హెచ్చరించింది. ముంబై మాత్రమే కాకుండా ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో కూడా వాణిజ్య సిలిండర్ల కొరత కనిపిస్తోంది. కొన్ని హోటళ్లలో వంటగ్యాస్ అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా సేవలను నిలిపివేస్తున్నారు. సిలిండర్ల కొరత కారణంగా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని హోటల్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది మధ్యవర్తులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని బ్లాక్ విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారనే వార్తలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కట్టడి చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచడంతో పాటు వాణిజ్య సిలిండర్ల సరఫరా పరిస్థితిని సమీక్షించేందుకు చమురు మంత్రిత్వ శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలో ప్రతి ఏడాది సుమారు 31.3 మిలియన్ టన్నుల వంటగ్యాస్ వినియోగం జరుగుతోంది. ఇందులో దాదాపు 62 శాతం గ్యాస్ దిగుమతుల ద్వారానే వస్తోంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా హోర్ముజ్ జలసంధి మార్గంలో రవాణా అంతరాయం ఏర్పడటంతో దిగుమతులపై ప్రభావం పడింది. అయితే దేశంలో ప్రస్తుతం సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.



## అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం కేటీఆర్



**-బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వర్క్‌షాప్ నిర్వహణ**
**-పార్టీ నేతల సూచనలు, అనుభవాల పంచిక**
**-ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు**

హైదరాబాద్, 10 మార్చి (మన ప్రజా ప్రతినిధి): తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, కొన సాగిస్తున్న అన్యాయాలపై అసెంబ్లీలో గట్టిగా నిలదీయడానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు బండా ప్రకాష్, మధుసూదనాచారి, సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీష్ రావు, రావుల చంద్రశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యులతో తమ అనుభవాలను పంచుకుంటూ అసెంబ్లీలో ఎలా సమర్థవంతంగా వ్యవహరించాలో సూచనలు చేశారు. ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై ఎలా స్పందించాలన్న అంశాలపై నేతలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మార్గనిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ప్రశ్నించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ గట్టిగా పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.

## వెలుగుమట్ల కూల్చివేతలపై బాధితుల ఆవేదన




**●ఉదయం నాలుగు గంటలకు కాలనీ చుట్టుముట్టారని ఆరోపణ**
**●బట్టలు, పిల్లల పుస్తకాలు కూడా తీసుకునివ్వలేదని వేదన**
**●కూల్చిన చోటే ఇల్లు కట్టించాలని డిమాండ్**

ఖమ్మం, 10 మార్చి (మన ప్రజా ప్రతినిధి): ఖమ్మం జిల్లా వెలుగు మట్లలో జరిగిన ఇళ్ల కూల్చివేతలపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమతో వ్యవహరించిన తీరు అమానుషంగా ఉందని ఒక బాధితురాలు పేర్కొన్నారు. తమను ఏదో పాకిస్తాన్ ఉగ్రవాదుల్లా భావించి కాలనీని చుట్టుముట్టి ఇళ్లను కూల్చివేశారని ఆరోపించారు. ఉదయం నాలుగు గంటల సమయంలోనే అధికారులు వచ్చి కాలనీ మొత్తాన్ని చుట్టుముట్టారని ఆమె తెలిపారు. ప్రతి ఇంటి వద్ద దాదాపు పది మంది అధికారులు నిలబడ్డారని పేర్కొన్నారు. ఇళ్లలోని వస్తువులను కూడా తీసుకునే అవకాశం ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ బట్టలు, పిల్లల పుస్తకాలు కూడా తీసుకునే అవకాశం ఇవ్వలేదని బాధితురాలు తెలిపారు. ఇప్పుడు తాము పేదవాళ్లు కాదని అధికారులు చెబుతున్నారని, కానీ ఇప్పటివరకు ఎవరూ వచ్చి తమ పరిస్థితి గురించి తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. ఈ చర్యల వల్ల తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. తమకు వేరే చోట ఇల్లు అవసరం లేదని బాధితులు స్పష్టం చేశారు. ఎక్కడ తమ ఇళ్లను కూల్చివేశారో అక్కడే మళ్లీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రీ-బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించిన భట్టి విక్రమార్క

**-గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ**
**-మహిళలు, చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి**
**-సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు**



హైదరాబాద్, 10 మార్చి (మన ప్రజాప్రతినిధి): రాబోయే రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలపై ప్రీ-బడ్జెట్ సమీక్ష సమావేశాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచి వాలయంలో జరిగిన ఈ సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణా భివృద్ధి కార్యక్రమాలు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, మహిళలు మరియు చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి కీలకంగా మారాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి దనసరి సీతక్క కూడా పాల్గొన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరై పథకాల అమలు పరిస్థితులను వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు

## గోదావరి పుష్కరాలపై మంత్రుల కీలక సమావేశం



హైదరాబాద్, 10 మార్చి (మనప్రజాప్రతినిధి): వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన గోదావరి పుష్కరాల కేబినెట్ ఉపసమితి సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. గోదావరి పుష్కరాలను ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రధాన దేవాలయాలను ఒక టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా గోదావరి తీరం వెంట ఉన్న పురాతన ఆలయాలను అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని మంత్రులు సూచించారు. ఆలయాల అభివృద్ధితో పాటు పర్యాటక అవకాశాలు పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. బాసర ఆలయానికి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఆమోదం లభించిన నేపథ్యంలో భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిపై చర్చించి ముఖ్యమంత్రి ఆమోదం పొందాలని నిర్ణయించారు. పుష్కరాల సమయంలో భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారి సౌకర్యాలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రులు సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్ మరియు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలను రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచేలా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు

మన
# ప్రజాప్రతినిధి
దినపత్రిక

బుధవారం మార్చి 11 2026



# తెలంగాణ కొత్త గవర్నర్‌కు ఘన స్వాగతం

**-హైదరాబాద్ చేరుకున్న శివ ప్రతాప్ శుక్లా**
**-విమానాశ్రయంలో ముఖ్యమంత్రి స్వాగతం**
**-మంత్రులు, ఉన్నతాధికారుల హాజరు**






హైదరాబాద్, 10 మార్చి (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. రాష్ట్రానికి వచ్చిన నూతన గవర్నర్‌కు ఘనంగా స్వాగతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా గవర్నర్‌కు స్వాగతం తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, రాష్ట్ర పోలీసు మహానిర్ధ్యాకుడు బి. శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు కూడా విమానాశ్రయంలో గవర్నర్‌ను ఆహ్వానించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన గవర్నర్ రాష్ట్రానికి చేరుకోవడంతో రాజ్ భవన్‌లో అధికారిక కార్యక్రమాలు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన నున్నారు. తెలంగాణకు కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కూడా ఆసక్తి నెలకొంది. త్వరలో అధికారిక ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని సమాచారం.

# మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

**-తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసుకున్న కేటీఆర్**
**-ట్యాంక్‌బండ్‌పై గర్జించిన లక్షల గొంతుకలు**
**-తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టమని వ్యాఖ్య**
**-అమరవీరులకు నివాళులు అర్పించిన కేటీఆర్**



హైదరాబాద్, 10 మార్చి (మనప్రజాప్రతినిధి): స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 సంవత్సరాలు పూర్తయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఒక కీలక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు తెలంగాణ ప్రజల్లో ఏర్పడిన ఉద్యమ స్ఫూర్తి అపారమైందని తెలిపారు. 2011 మార్చి 10న నిర్వహించిన మిలియన్ మార్చ్ సందర్భంగా ఎన్నో నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు ఉన్నప్పటికీ ఉద్యమకారుల సంకల్పాన్ని అవి దెబ్బతీయలేకపోయాయని కేటీఆర్ తెలిపారు. బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏర్పాటు చేసినా తెలంగాణ కోసం పోరాడిన ప్రజల ఉత్సాహాన్ని ఆపలేకపోయాయని ఆయన అన్నారు. ఆ రోజు లక్షలాది మంది ట్యాంక్‌బండ్‌పై ఒకే స్వరంతో తెలంగాణ కోసం నినదించారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన పోరాట రూపాల్లో మిలియన్ మార్చ్ ఒకటని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత, ప్రజా సంఘాల పాత్రను ఆయన ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు చూపిన ఐక్యత దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఈ సందర్భంగా కేటీఆర్ స్మరించారు. అమరవీరులకు జోహార్లు తెలుపుతూ జై తెలంగాణ అంటూ తన సందేశాన్ని ముగించారు. మిలియన్ మార్చ్ సందర్భంగా తీసిన పాత చిత్రాలను కూడా ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

# ప్రభుత్వంపై కవిత ఆగ్రహం

**-నిరాహార దీక్ష నుంచి అర్ధరాత్రి అరెస్ట్‌పై మండిపాటు**
**-పేదల ఇళ్ల కూల్చివేతపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**
**-అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిక**



హైదరాబాద్, 10 మార్చి (మనప్రజాప్రతినిధి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం గళమెత్తిన తనను ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేయడం అన్యాయమని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కూల్చివేసిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటే పేదలకు ఇచ్చే భూములేనని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి చర్యలు చేపడుతోందని ఆమె విమర్శించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ ఈ ఘటనపై స్పందించాలని కవిత సూచించారు. ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న పరిస్థితిని ఆయన గమనించాలని కోరారు. ఈ అంశంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ చర్యల వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నారని కవిత తెలిపారు. పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ దాఖలు చేసి న్యాయపోరాటం కూడా కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# రన్నింగ్ పోటీలో హెడ్ కానిస్టేబుల్ మృతి

**-మంగళగిరి ఆరో బెటాలియన్‌లో విషాదం**
**-పీపీటీ ట్రైనింగ్‌లో పాల్గొన్న సమయంలో ఘటన**
**-గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారణ**



మంగళగిరి, 10 మార్చి (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో విషాద ఘటన చోటుచేసుకుంది. పీపీటీ ట్రైనింగ్‌లో భాగంగా నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న ఓ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. మంగళగిరి ఆరో బెటాలియన్‌లో జరిగిన ఈ ఘటన పోలీసు వర్గాల్లో తీవ్ర విషాదాన్ని కలిగించింది. విజయవాడలోని రామవరప్పాడుకు చెందిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు పీపీటీ ట్రైనింగ్‌లో పాల్గొనేందుకు మంగళగిరి ఆరో బెటాలియన్‌కు వచ్చాడు. మంగళవారం నిర్వహించిన 3.2 కిలోమీటర్ల పరుగు పందెంలో ఆయన పాల్గొన్నారు. అయితే పరుగు ప్రారంభించిన కొద్దిసేపటికే వెంకటేశ్వరరావు అస్వస్థతకు గురయ్యాడు. ఛాతి పట్టుకుని మధ్యలోనే కుప్పకూలడంతో అక్కడ ఉన్న సిబ్బంది వెంటనే స్పందించారు. వెంటనే అతన్ని సమీపంలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనతో మంగళగిరి ఆరో బెటాలియన్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడు వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

# నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో... విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ




నేరేడుచర్ల//మనప్రజాప్రతినిధి: నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి ఆధ్వర్యంలో చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడిపాల వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు.PMJF లయన్ ఏదుల అంజిరెడ్డి సౌజన్యంతో సుమారు రూ.3000 విలువైన పరీక్ష సామగ్రితో ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ఏదుల అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, జిలకర రామస్వామి, కందిబండ శ్రీనివాస్, ములగుండ్ల వెంకటరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, గంధం శావయ్య తదితరులు పాల్గొన్నారు.

# దీపిక మృతి కేసులో సీనియర్ డాక్టర్ అరెస్ట్

**-విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో సంచలనం**
**-పెళ్లికి నిరాకరణతో ఆత్మహత్యకు ప్రేరేపణ ఆరోపణలు**
**నిందితుడికి 14 రోజుల రిమాండ్**





విజయవాడ, 10 మార్చి (మనప్రజాప్రతినిధి): విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో అనుమానాస్పదంగా మృతి చెందిన అనస్తీషియా పీజీ విద్యార్థిని బత్తుల దీపిక కేసులో పోలీసులు కీలక చర్యలు తీసుకున్నారు. ఈ కేసులో ఆమె సీనియర్ డాక్టర్ అమర్ సహస్రరెడ్డిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీపిక మృతి కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మొదట ఇది అనుమానాస్పద మృతిగా నమోదైనప్పటికీ దర్యాప్తులో కొత్త విషయాలు బయటపడ్డాయి. పెళ్లికి నిరాకరించడంతో ఆమెను మానసికంగా వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేసులోని సెక్షన్లను మార్చి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు అతనిని 14 రోజులపాటు న్యాయస్థాన రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం రోగులకు మత్తు ఇవ్వడానికి ఉపయోగించే ఇంజక్షన్‌ను తీసుకుని దీపిక ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

# ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి




హైదరాబాద్ ( మనప్రజాప్రతినిధి):స్త్రీల విద్యాభివృద్ధి కొరకు హక్కుల కొరకు పోరాడిన తొలితరశీ మహిళా నేత సావిత్రిబాయి పూలే అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు మంగళవారం నాడు హైదరాబాదులోని హిమాయత్ నగర్ లో గల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ..... భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే భారతదేశంలో మనుధర్మ శాస్త్ర ప్రకారం చదువుకోలేని మహిళలకు చదువు చెప్పాలని ఆనాటి చాందసవాదులు ఎన్ని అవమానాలు తలపెట్టినా ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా భరించి మహిళా జాతి అభ్యున్నతికే తన జీవితాన్ని అంకితం చేసిన మహానీయురాలని మహిళలపై జరుగుతున్న అన్ని రకాల నిర్బంధాలు దౌర్జన్యాలు తొలగిపోవాలంటే చదువు ఉండాలని మహిళలు విద్యావంతురాలై విజ్ఞానవంతులై సమాజ అభివృద్ధికి తోడ్పాటు కావాలని అలాంటి ఆలోచన చేసి మన మహిళా జాతికి విముక్తిని, ఆలోచనను అందించినటువంటి సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు వెనుకబడిన ప్రాంతాల్లోని ఆడపిల్లలను చేరదీసి ఆడపిల్లల చదువు సమాజానికి మార్గదర్శకమని భావించి వారి చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్య మూర్తి అని సమాజంలోని రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణిని అని ఆయన ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి కే విజయ రాములు ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఎం ప్రభాకర్ రెడ్డి మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ శాంతిసంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేపీఎల్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ యల్లావుల రాములు, రచ్చ కిషన్ కాసోజు మహాలక్ష్మి నరసమ్మ పాల్గొన్నారు

# శ్యామల నాగయ్య కుటుంబానికి క్వింట బియ్యం సహాయం




మనప్రజాప్రతినిధి// తేదీ 10/03/2026: తిరుమలగిరి మండలం పరిధిలోని గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ గా పనిచేస్తున్న శ్యామల నాగయ్య గారు అకాల మరణంతో మృతి చెందడం జరిగింది వారి సతీమణి సుమీల. ఇద్దరుకుమారులు శ్యామల వినయ్ అభినయ్ చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు రేగుల అనిల్ మాట్లాడుతూ వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని చెప్పడం అలాగే క్వింట బియ్యము అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కోల మధు దోర్నాల కృష్ణ బీసు శ్రీకాంత్ డి ప్రవీణ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# క్రికెట్ టోర్నమెంట్...




మనప్రజాప్రతినిధి//ఘట్కేసర్: ఈ క్రికెట్ టోర్నమెంట్ కి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిఆర్ఎస్ యువ నేత చామకూర మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి హాజరై ప్రారంభించారు..ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ... మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కి యువత అంటే చాలా మక్కువ..మల్లారెడ్డి ఎప్పుడు యువతను ప్రోత్సహించడం, ఉత్సాహ పరుస్తుంటాడు. మల్లారెడ్డి అభిరుచిని గుర్తించి 50వ వివాహ వసంతం సందర్భంగా సామల సందీప్ రెడ్డి, ఈ క్రికెట్ టోర్నమెంట్ ను ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు.ఈ క్రికెట్ టోర్నమెంట్లో ఉమ్మడి ఘట్కేసర్ మండలంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన టీంలు నమోదు చేసుకొని స్పోర్ట్స్ లో పాల్గొన్నారు...ఈ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఘాట్కేసర్ ఉమ్మడి మండలానికి సంబంధించిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు టీకలు వేయించాలి




మొగుడంపల్లి మార్చి 10 (మనప్రజాప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండల కేంద్రంలో మార్చ్ 10వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల10వ తేదీ నుండి ఏప్రిల్ 10వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో పశువు చికిత్స శాలల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందని స్థానిక పశువైద్య అధికారి డాక్టర్ సునీల్ దత్ తెలియజేశారు పశువులకు గాలికుంటు నివారణ టీకాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్య అతిథులు స్థానిక గ్రామ సర్పంచ్ బి రాజు. మాజీ ఎంపిటిసి బక్కయ్య. మొహమ్మద్ ఖాన్.ఓయస్ శంకర్. శ్రీనివాస్ గోపాల్ మిత్ర. కపిల్ పశు మిత్ర మరియు రైతులు పాల్గొన్నారు ఈ సదర్భంగా డాక్టర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఈ గాలి ఉంటూ టీకాలు ప్రతి ఒక్క పశువుకు రైతు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు పశువులకు గాలికుంటు వ్యాధి ఒక వైరస్ వల్ల వస్తుందని అన్నారు గాలికుంటు వ్యాధి సోకిన పశువు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుందని తెలిపారు ఈ టీకాలు వేయించడం వలన పాల ఉత్పత్తితో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయని స్థానిక పశువు వైద్యాధికారి డాక్టర్ సునీల్ దత్ తెలిపారు

# లక్ష రూపాయల విరాళం



సదాశివపేట మార్చు 9 //( మన ప్రజాప్రతినిధి):సదాశివపేట పట్టణంలోని శ్రీ అయ్యప్ప మందిర ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మహిళ దినోత్సవ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు (చిరంజీవి) పాల్గొనడం జరిగింది. ఆలయ అభివృద్ధి కొరకు ఒక లక్ష రూపాయలు(₹1,00,000) విరాళంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మందిరానికి ఎటువంటి మద్దతు కావాలన్న ముందుంటనని ఆలయ కమిటీకి హామీ ఇవ్వడం జరిగింది. దైవ సేవ చేయడంలో మనసుకు ప్రశాంతత లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గోనే శంకర్, ఉపాధ్యక్షులు సుధాకర్, ట్రెజరర్ రాచన్న ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




మనప్రజాప్రతినిధి//మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 10:చేగుంట మండల పరిదిలోని అనంతసాగర్ గ్రామం లో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల లో మంగళవారం రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయులైన ఫర్జానా, జ్యోతి ,శ్రావ్య, రజిత,చంద్రకళ ను సత్యనారాయణ, రాఘవేంద్ర, రంజిత్, ఘనంగా శాలువాతో సత్కరించడం జరిగింది.

# హుస్నాబాద్ బస్ స్టాండ్ ను పరిశుభ్రంగా ఉంచుదాం



హుస్నాబాద్ మార్చి//మనప్రజాప్రతినిధి 10):హుస్నాబాద్ బస్ స్టాండ్ లో 99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న నాయక్ ఆదేశాల మేరకు చెత్తను తొలగించడం, బాత్రూం లు శుభ్రం చేయడం జరిగింది. బస్ స్టేషన్ మేనేజర్ లకవత్ హరి నాయక్ మాట్లాడుతూ ప్రయాణికులు బస్ స్టాండ్ లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిశుభ్రతను కాపాడాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వాడకూడదని,చెత్త వెయ్యడానికి డస్ట్ బిన్ ఏర్పాటు చెయ్యడం జరిగిందని, స్వచ్ఛ హుస్నాబాద్ బస్ స్టేషన్ తెలియజేయడం జరిగింది. గార్డెన్ క్లీన్ అండ్ గ్రీన్ ఉంచడం జరుగుతుందన్నారు. మన ఇంట్లో ఎలా ఉంటామో అలానే మన బస్ స్టాండ్ లో అలాగే క్లిన్ గా ఉంచుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యశాఖ కార్యాలయంలో శుభ్రత పరిశుభ్రత కార్యక్రమం





మెదక్ జిల్లా//మనప్రజాప్రతినిధి:99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం ఆధ్వర్యంలో మత్స్యశాఖ కార్యాలయం ప్రాంగణంలోని సిబ్బందితో కలిసి చేప పిల్లలు పెంచే నీటి తొట్లలో ఉన్న చెత్తాచెదారాన్ని అలాగే చెట్లను పొదలను తొలగించారు. ప్రభుత్వం తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మా కార్యాలయంలో నేడు చేశామని అలాగే ఈ కార్యక్రమంలో మూడు రోజులపాటు కొనసాగిస్తామని వెల్లడించారు. 99 రోజుల ప్రజా పలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మత్స్య కార్మికులతో పాటు మా సిబ్బంది జిల్లాలోని వివిధ మండలాలు కూడా చేస్తారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది నరేష్ సంతోష్ సంతోష్ రాజ మహేష్ బాలాజీ బసవరాజ్ యాదగిరి రాములు వాజీద్ పాల్గొన్నారు

# ఆల్ ది బెస్ట్"



**-మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు కృషి చేయాలి**
**-ఏబీవీపీ ప్రాంత సంఘటన మంత్రి విష్ణువర్ధన్**

హుస్నాబాద్ మార్చి మనప్రజాప్రతిని. 10):అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్క్రీన్ టైమ్ టు ఎగ్జామ్ టైం పేరుతో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ఒత్తిడికి గురి కాకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి 500 మందికి ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. హుస్నాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏబీవీపీ ప్రాంత సంఘటన మంత్రి విష్ణువర్ధన్, జనగామ మురళీధర్ రావు , ముఖ్య వక్తగా ఉమాపతి, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్, జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 1949 జులై 9న ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు గత 77 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో నిత్యం విద్యార్థుల్లో, యువతలో దేశభక్తిని సామాజిక స్పృహాను చుట్టూ ఉన్న సమాజానికి సేవ చేయాలనే ఆలోచనలను పెంపొందించడానికై కృషి చేస్తుందని, అనేక విద్యారంగ సమస్యలపై పోరాడుతూనే సమాజానికై గళం విప్పుతూ కేవలం ఆందోళన కార్యక్రమాలు కాకుండా అనేక సేవా కార్యక్రమాలతో ముందుకు పోతున్నామన్నారు. విద్యార్థులంతా ఈ పదవ తరగతి పరీక్షలు మీ పుస్తకంలో ఒక పేజీ లాంటివి అని ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధమై అత్యుత్తమంగా మీ తల్లిదండ్రులకు,మీ పాఠశాల యాజమాన్యాలకు, మన ప్రాంతానికి మంచి పేరు తెచ్చే విధంగా చదువుకోవాలని మీ వెంట నిత్యం ఏబీవీపీ ఉంటుందని అంటూ విద్యార్థులకు "ఆల్ ద బెస్ట్ " తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ విభాగ్ సంఘటన మంత్రి లక్ష్మణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాహుల్, నగర కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షులు రాజు అంజి, మహిళా కన్వీనర్ శిరీష, అశ్విని పూర్వ ఏబీవీపీ కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు



హుస్నాబాద్ మార్చి మన ప్రజాప్రతినిధి. 10) హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ చైర్పర్సన్ దండి లక్ష్మి మరియు కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో 14వ16వ వార్డుల్లో చెత్తను తొలగించడం, స్టోన్ వాటర్ డ్రైన్ల వద్ద స్క్రీనింగ్ బార్ లను ఏర్పాటు చేయడం జరిగింది. చైర్ పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత పరిశు భ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పట్టణ పరిశుభ్రతను కాపాడాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వాడకూడదని, పట్టణాన్ని స్వచ్ఛ హుస్నాబాద్ పట్టణంగా పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. స్టోన్ వాటర్ డ్రైన్ల జెసిబి సహాయంతో శుభ్రపరిచి స్క్రీనింగ్ బార్ లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ , కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, మెప్మా రిసోర్స్ పర్సన్స్ సిబ్బంది, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాల వల్ల మొక్కజొన్న పంట నష్టం నష్టపరిహారం ఇవ్వాలని రైతు డిమాండ్



(మన ప్రజా ప్రతినిధి మార్చ్ 10):సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఉన్న శ్రీ సంగమేశ్వర ట్రేడర్స్ ప్రైవేట్ షాపులో కొనుగోలు చేసిన విత్తనాల వల్ల మొక్కజొన్న పంట నష్టపోయిందని రైతు దండు భూపాల్ ఆరోపించారు. సూరంపల్లి గ్రామానికి చెందిన దండు భూపాల్ (సన్నాఫ్ కిష్టయ్య) తెలిపిన వివరాల ప్రకారం, నూజివీడు కంపెనీకి చెందిన విన్నర్ రకం విత్తనాలను ఒక ఎకరాకు రెండు బ్యాగులు చొప్పున శ్రీ సంగమేశ్వర ట్రేడర్స్ వద్ద కొనుగోలు చేసి పంట వేశారు.అయితే పంట చివరి దశలో విల్ట్ వ్యాధి రావడంతో మొత్తం మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని షాప్ యజమాని నాగప్పకు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని భూపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.తనకు జరిగిన నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని ఒక ఎకరా మొక్కజొన్న పంటకు తగిన నష్టపరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించి విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

# సామాజిక రాజకీయ రంగాలలో గౌడ కులస్తులు చైతన్యవంతులు కావాలి



**-గౌడ కులస్తులు ఆర్థికంగా ఎదగాలి**
**-గౌడ కుటుంబ సభ్యులకు చేదోడువాదోడుగా నిలబడాలి**
**-సమాజానికి గౌడ కులస్తుల ఐక్యతను చాటి చెప్పాలి**
**-రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిలుకూరి గోవర్ధన్ గౌడ్**

మనప్రజాప్రతినిధి/మనకొండూరుతేదీ 10మార్చ్ :ఇల్లంతకుంట మండల కేంద్రంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ మాత అన్నపూర్ణేశ్వర ఫంక్షన్ హాల్ లో గౌడ కులానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు,వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకూరి గోవర్ధన్ గౌడ్,ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్,హాజరయ్యారు.ఈ సందర్భంగా చిలుకూరి గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులానికి చెందిన ప్రజాప్రతినిధులను సన్మానించడం సంతోషకరమని తెలిపారు. గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగి రాజకీయ,సామాజిక రంగాలలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కృషి చేయాలని కోరారు.అలాగే యువత విద్య, ఉపాధి రంగాలలో ముందుకు రావాలని, సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గౌడ సమాజం ఐక్యంగా ఉంటే రాజకీయంగా కూడా మంచి స్థానం పొందవచ్చని అన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని గౌడ సంఘం నాయకులు, వివిధ గ్రామాల గౌడ కులస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు

# దుద్దెడ అంగన్వాడీ కేంద్రాల్లో బాలమేళా కార్యక్రమం



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్: దుద్దెడ అంగన్వాడి కేంద్రాల్లో మంగళ వారం రోజు బాలమేళా కార్యక్రమాన్ని రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్న పిల్లలకు నిర్బంధ విద్య బోధించకుండా, వారికి ఆట పాటలతో కూడిన విద్యా బోధనచేస్తూ, అంతర్గతంగా వారిలో ఉన్న సృజనాత్మకతను గమనిస్తూ, పిల్లల శరీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడే ప్రయత్నంచేస్తూ విద్యపట్ల వారికీ మక్కువ కల్పించే మంచి వాతావరణం కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా అంగన్వాడి కేంద్రాల్లో ఎలా చేస్తున్నామనేది పిల్లల తల్లులకు అర్థమయ్యేలా చేయడమే ముఖ్య ఉద్దేశంతో ఈ సమావేశాన్ని నిర్వహించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇందిర, తల్లులు కమిటీ సభ్యులు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం లో ఒకరుమృతి,ఇద్దరికి తీవ్ర గాయాలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 19,:మాసాయిపేట మండల పరిధిలోని బంగారమ్మ దేవాలయం సమీపంలో 44వ జాతీయ రహదారిపైకారు అదుపుతప్పి చెట్టును ఢీకొనగ . కామారెడ్డి జిల్లా పోసానిపేటకు చెందిన మోహన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు,మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న చేగుంట పోలీసులు సంఘటన స్థలానికి చేసుకుని, మోహన్ రెడ్డి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తీవ్ర గాయాలైన ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

# డబల్ వీల్ మార్కర్ యంత్రం- మొక్కజొన్న రైతుల నేస్తం




ప్రజాప్రతినిధి సరుబుజ్జి:సరుబుజ్జిలి లో వరి మాగానిలో నేరుగా మొక్కజొన్న సాగు చేసే రైతులకు వరసల మధ్య మరియు విత్తనాల మధ్య సమాన దూరంలో విత్తుకోవడానికి డబల్ వీల్ మార్కర్ యంత్రం చాలా ఉపయోగకరంగా ఉందని ఏ డి రాజగోపాల్ అన్నారు. మంగళవారం సరుబుజ్జిలి మండలంలో సరుబుజ్జిలి గ్రామంలో డబల్ వీల్ మార్కర్స్ రైతులకు అందించే కార్యక్రమంలో భాగంగా వరి కోతలు అనంతరం నేరుగా మొక్కజొన్న సాగు చేసేందుకు అనువైన డబల్ వీల్ మార్కర్ యంత్రాలను పరిసర మండలాల సరుబుజ్జిలి, ఎల్ ఎన్ పేట, బూర్జ మండలల లీడ్ ఫార్మర్స్ కు అందించారు. దున్నకొండ మొక్కజొన్న సాగు చేపట్టడం వలన అదనపు సాగు ఖర్చులు, సుమారు 2,3 నీటి కడులు ఆదా చేయవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సరుబుజ్జిలి క్లస్టర్ టీమ్ లీడర్ లావణ్య గారు అన్నారు. గ్రామస్థాయిలో లీడ్ ఫార్మర్స్ వద్ద డబల్ వీల్ మార్కర్స్ అందుబాటులో ఉంచామని వాటిని రైతులు పరస్పర సహకారంతో సక్రమంగా వినియోగించుకుంటూ మొక్కజొన్న సాగు విస్తీర్ణ పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి మండలం ఏవో మన్మధరావు. వి ఏ గాయత్రి, వెంకటలక్ష్మి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, సమన్వయకర్తలు ఏసు, శ్రీను, కుమారి, ఈశ్వరరావు, మరియు లీడ్ ఫార్మర్స్, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ : రవీంద్ర నగర్, విశ్వనాధపల్లి గ్రామ ఉపసర్పంచ్ కోడెల కిరణ్ తండ్రి కోడెల నర్సయ్య మంగళవారం ఉదయం పొలం దగ్గరకు వెళ్తున్న క్రమంలో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాజీ జెడ్పిటీసి అనంతుల అశ్విని ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, మాజీ ఎంపిపి ర్యాగాళ్ల సుగుణ దుర్గయ్య తో కలిసి వెళ్లి ఉపసర్పంచ్ కిరణ్ ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి అనంతుల ప్రశాంత్ పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో రవీంద్ర నగర్, విశ్వనాథ పల్లి గ్రామ సర్పంచ్ కవితరవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోడెల మల్లేశం నాయకులు బొద్దుల తిరుపతి, ఐలయ్య, రవీందర్ రావు , శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మన ప్రజాప్రతినిధి దినపత్రిక

బుధవారం మార్చి 11 2026



# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన సిఐ నెమ్మని శ్రీనివాస్




**-సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో 'ప్రజాప్రతినిధి' క్యాలెండర్ ఆవిష్కరణ**
**-సిఐ నెమ్మని శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరణ..**
**-యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపు**

మనప్రజాప్రతినిధి//రాజన్నసిరిసిల్ల, మార్చి 10:రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో 'ప్రజా ప్రతినిధి' టీవీ ఛానల్ మరియు పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి సిరిసిల్ల పట్టణ సిఐ నెమ్మని శ్రీనివాస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారుఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో అవగాహన కల్పించడంలో మీడియా పాత్ర కీలకమని కొనియాడారు. అనంతరం యువతను ఉద్దేశించి పలు కీలక సూచనలు చేశారుయువత మద్యం, మత్తు పదార్థాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, నిబంధనలు అతిక్రమిస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సోషల్ మీడియాపై యువత సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయకుండా, చదువుపై దృష్టి సారించాలని కోరారు.ప్రజలకు వార్తలను చేరవేయడంలో 'ప్రజా ప్రతినిధి' యాజమాన్యం మరియు సిబ్బంది చూపిస్తున్న చొరవను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పులి మల్లేశం, టౌన్ రిపోర్టర్ శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ రిపోర్టర్ ఎం. తిరుపతి, రిపోర్టర్లు జి. రాజు, ఇంతియాజ్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు చేతుల మీదుగా ఘనంగా ప్రజాప్రతినిధి క్యాలెండర్ ఆవిష్కరణ**




మనప్రజాప్రతినిధి/వేములవాడ,మార్చి, 10:రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో 'మన ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. 'ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తన చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వార్తా సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో వారధిలా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో ఈ సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారుఈ ఆవిష్కరణ కార్యక్రమంలోపులి మల్లేశం (సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్)శ్రీనివాస్ (టౌన్ రిపోర్టర్)తిరుపతి (వేములవాడ రిపోర్టర్)మరియు ఇతర పత్రికా సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధి పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్సై సమత

**-అతి తక్కువ సమయంలోనే ప్రజల మన్ననలు పొందుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిణామాలపై ఎప్పటికప్పుడు వెలికి తీస్తున్న ప్రజాప్రతినిధి పత్రిక టీవీ ఛానల్**
**-జర్నలిస్టులు ప్రజల పక్షాన పోరాడాలి, ప్రజల నమ్మకమే మూలధనముగా వార్తా విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలి..**



మనప్రజాప్రతినిధి//మిరుదొడ్డి:సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్ సమత చేతుల మీదుగా ప్రజా ప్రతినిధి టీవీ ఛానల్ క్యాలెండర్, మన ప్రజా ప్రతినిధి పత్రిక క్యాలెండర్ ఘనంగా క్యాలెండర్ చేశారు ఈ సందర్భంగా ఎస్సై సమత మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మద్యం మరియు మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్ని సరైన పత్రాలు తమ వద్ద కలిగి ఉండాలని చెప్పారు.అదేవిధంగా మైనర్ పిల్లలు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు వెలుగులోకి వస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత సమయాన్ని వృథా చేసే సోషల్ మీడియాకు ఎక్కువగా అలవాటు పడకుండా చదువులు, తమ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు.ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా ముఖ్య పాత్ర పోషిస్తోందని పేర్కొంటూ, ప్రజా ప్రతినిధి టీవీ ఛానల్‌కు ఎస్సై సమత ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన రాయపోల్ ఎస్సై మానస

మనప్రజాప్రతినిధి//రాయపోల్:సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్ మానస చేతుల మీదుగా ప్రజాప్రతినిధి టీవీ ఛానల్ పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మానస







మాట్లాడుతూ చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే యువత డ్రగ్స్, మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా ఎవరైనా మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉండి బయటకు రాకుండా ఉంటే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని చెప్పారు.ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధి టీవీ ఛానల్ మరియు పత్రిక ప్రతినిధులకు ఎస్సై మానస కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన తొగుట సీఐ షేక్ లతీఫ్

**-జర్నలిస్టులు ప్రజల పక్షాన పోరాడాలి ఎవరికి భయపడకుండా నిర్భయంగా నిస్సంకోచంగా వార్త రాయాలన్నారు.**
**-పత్రిక రంగంలో మన ప్రజాప్రతినిధి పత్రిక, ప్రజాప్రతినిధి టీవీ ఛానల్ తొగుట మండలంలో ప్రత్యేక గుర్తింపు.**

మనప్రజాప్రతినిధి//తొగుట:సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ లతీఫ్ చేతుల మీదుగా మనప్రజాప్రతినిధి టీవీ ఛానల్ క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన సీఐ షేక్ లతీఫ్ ఈ సందర్భంగా సీఐ షేక్ లతీఫ్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మద్యం,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు.అదేవిధంగా మైనర్ పిల్లలు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు లేదా యువత ఎవరైనా మనస్థాపానికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ అందించి మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావడానికి పోలీస్ శాఖ సహకారం అందిస్తుందని తెలిపారు .ప్రజల్లో చైతన్యం కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంటూ, మన ప్రజా ప్రతినిధి టీవీ ఛానల్ సేవలను సీఐ అభినందించారు.
ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజాప్రతినిధి క్యాలెండర్ ఆవిష్కరించిన నేరేడుచర్ల ఎమ్మార్వో సైదులు

**-జర్నలిస్టులు ప్రజల పక్షాన పోరాడాలి ఎవరికి భయపడకుండా నిర్భయంగా నిస్సంకోచంగా వార్త రాయాలన్నారు..**
**-అతి తక్కువ సమయంలోనే ప్రజల ఆదరణ పొందుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిణామాలపై ఎప్పటికప్పుడు వెలికి తీస్తున్న ప్రజాప్రతినిధిపత్రిక, ప్రజాప్రతినిధి టీవీ ఛానల్**
**-పత్రికా రంగంలో మనప్రజాప్రతినిధి పత్రిక ప్రజాప్రతినిధి టీవీ ఛానల్ నేరేడుచర్ల మండలంలో ప్రత్యేక గుర్తింపు**



నేరేడుచర్ల//మనప్రజాప్రతినిధి: నేరేడుచర్ల మండల కేంద్రంలో తాసిల్దార్ ఆఫీస్ నందు ఎమ్మార్వో సురగి సైదులు మీదుగా మన ప్రజాప్రతినిధి క్యాలెండర్ ను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులకు ప్రజలకు వారిదిగా పనిచేస్తున్న విలేకరులు సమాచారాన్ని తెలియజేయడంలో ముందస్తు ఉంటారని, ప్రజా సమస్యలపై ప్రశ్నించే విధంగా వార్తా సమస్యలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేయడంలో వారిదిలా పనిచేస్తారని, పత్రికలు టీవీ చానల్ నేడు ప్రజాసమలపై స్పందిస్తూ, అధికారులపై తమ గళాన్ని ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎడవెల్లి అరుణ్, లయన్స్ క్లబ్ సామాజిక కార్యకర్త తక్కెళ్ళ నాగార్జున, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగరాజు, సిబ్బంది మరియు పుర ప్రముఖులు పాల్గొన్నారు

